క్లుప్తంగా

ఉపాధి సిబ్బందితో సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న బాలాజీ

పెద్దపంజాణి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో ఎంపీడీఓ బాలాజీ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న పనుల ప్రగతి గురించి ఆరా తీశారు. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ఏపీఓ మురుగేషన్, ఈసీ నాగమణి, టీఏలు జీవీ రెడ్డి, దేవేంద్ర, పల్లవి పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం


సమస్యలు వింటున్న వికాస్ మర్మత్

కుప్పంరూరల్: ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ అన్నారు. కంగుంది గ్రామంలో బుధవారం 'ప్రజాదర్బార్–మన పంచాయతీ వద్దకు మన ప్రభుత్వం' గ్రామసభ నిర్వహించారు. సమావేశానికి హాజరైన వికాస్ మర్మత్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులను ఇక్కడికి తీసుకొచ్చామన్నారు. ప్రజలు మండల కేంద్రానికి రాకుండానే తామే మీ వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. గ్రామసభలో వచ్చిన సమస్యలను ఆయా అధికారులకు అనుసంధానం చేశారు. ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్. మునిరత్నం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవం


హోమపూజ నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో విశేష సంధి, రెండవ కాలపూజ, మండలేశ్వర పూజ, వ్రత సమర్పణ, గంధ పవిత్ర సమర్పణ, మూడవ కాలపూజ, విశేష ద్రవ్యాహుతి, లఘుపూర్ణాహుతి పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

18న సచివాలయాల ఎదుట ధర్నా

చిత్తూరు కార్పొరేషన్: అధికారంలో వస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, రుణాలు ఇస్తామని కూటమి ప్రభుత్వ హామీ నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. చిత్తూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో 2, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీనిచ్చారన్నారు. ఆ హామీ నెరవేర్చాలని జిల్లాలోని సచివాలయాల ఎదుట నవంబర్ 18న నిరసన కార్యక్రమాలు చేయనున్నమన్నారు.

వందకుపైగా నీతిపద్యాలను అలవోకగా..



గంగవరం మండలం కీలపట్ల ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న జ్యోతిర్మయి వందకు పైగా నీతిపద్యాలను అలవోకగా చెప్పగలదు. ఇటీవల తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి నిర్వహించిన రాష్ట్ర స్థాయి పద్యాల పోటీల్లో బహుమతిని గెలుచుకుంది.

ఆటపాటల్లో రాణిస్తున్న భానుప్రియ..



కీలపట్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన భానుప్రియ వందకుపైగా వేమన పద్యాలను ఠక్కున చెప్పగలదు. పాటలు పాడడం, నృత్యం చేయడంలో దిట్ట. చదువులోనూ ముందంజలో ఉంటుంది. బడిలో ఏ కార్యక్రమం నిర్వహించినా వాటిలో పాల్గొని బహుమతులను గెలుచుకుంటుంది.

కథలు చెప్పడం తన్మయికి హాబీ...



గంగవరం మండలం నల్లగుట్లపల్లికి చెందిన తన్మయి కథలు చెప్పడంలో దిట్ట. మూడో తరగతి చదువుతున్న ఈ చిన్నారి వందలాది కథలను గుక్క తిప్పుకోకుండా చెబుతోంది. భవిష్యత్తులో రామాయణం, మహాభారతం సైతం కంఠాపాటం చేసుకోవాలని ప్రయత్నం చేస్తోంది.

పిల్లలు కాదు పిడుగులు



నేటి బాలలే రేపటి పౌరులు, వారే దేశానికి అభివృద్ధి కారకులు. అందుకే వారిని విద్యావంతులుగా, శక్తివంతులుగా మార్చేందుకు దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిన్నారుల విద్యకు పెద్దపీట వేశారు. నేడు నెహ్రూ జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో టాలెంట్ చూపుతున్న బాలల గురించి తెలుసుకుందాం. –పలమనేరు

- పలు రంగాల్లో నైపుణ్యాలను చూపుతున్న చిన్నారులు
- నేడు బాలల దినోత్సవం

కూచిపూడిలో దిట్ట హారిక..

పలమనేరు పట్టణంలోని కిశోర్ కుమార్తె హారిక గంగవరం మండలం పత్తికొండకు చెందిన సరిత వద్ద భరతనాట్యం, కూచిపూడి నేర్చుకుంది. శాస్త్రీయ నృత్యంలో జిల్లా స్థాయిలో పలుమార్లు మొదటి స్థానంలో నిలిచింది. ముఖ్యంగా శాస్త్రీయ నృత్యంలో అమోఘమైన ప్రతిభాపాటవాలను చూపుతోంది. పాఠశాల స్థాయిలో జరిగే పోటీలతోపాటు ఇతర జిల్లా స్థాయి నృత్య పోటీల్లో పాల్గొంటూ పలువురిచే అభినందనలు పొందింది.



కరాటేలో కవలల ప్రతిభ

వి.కోట: మండలంలోని గాండ్లపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి, ప్రకాష్ దంపతుల కుమారులు కవలలు. భరత్ విఘ్నేష్, భగత్ విఘ్నేష్ చిన్నప్పట్టి నుంచి కరాటేలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు ప్రశంసాపత్రాలు, పతకాలు సాధించి మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు ఈ కవలలు. 2017లో జరిగిన అఖిల భారత కరాటే ఫెడరేషన్‌కు ఎన్నికై బంగారు పతకాలు సాధించారు. కోల్‌కతాలో నిర్వహించిన దక్షిణాసియా కరాటే పోటీల్లో, కేరళలో జరిగిన 16వ నేషనల్ కరాటే చాంపియన్ పోటీల్లో ఇద్దరు బంగారు పతకాలు సాధించి మన రాష్ట్రానికి గుర్తింపు తెచ్చారు.


ప్రశంసాపత్రాలతో భగత్, భరత్ (ఫైల్)

యోగాలో జ్ఞానకుస్మిత


యోగాసనాలు చేస్తున్న జ్ఞానకుస్మిత

వి.కోట: మండలంలోని వి.కోటకు చెందిన జ్ఞానకుస్మిత ప్రస్తుతం బైరెడ్డిపల్లి మండలంలోని ఏపీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చిన్నవయస్సు నుంచి యోగాలో ప్రతిభ కనబరుస్తూ మండల స్థాయి, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి పలు ప్రశంసాపత్రాలు, బహుమతులను పొందింది. శ్రీజీ యోగా వారు బెంగళూరులో నిర్వహించిన నోబుల్ వరల్డ్ రికార్డులో 8 ఏళ్ల వయస్సులోనే నిర్వాహకులు నిర్దేశించిన సమయం వరకు నిరంతరాయంగా సూర్య నమస్కారాలు చేసి రికార్డులో తన స్థానం సంపాదించింది. గత ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో రిథమిక్‌యోగాలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి రిథమిక్‌కు ఎంపికైంది. దీంతో పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసాపత్రాలు, బహుమతులు సాధించింది.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ రేపు

గంగవరం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరగబోయే అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమానికి అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2025–26వ సంవత్సరానికి సంబంధించి అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రణాళికలు రూపొందించడం కోసం మండల స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు: నేటి ఉదయం 11 గంటల నుంచి 12 గంటల దాకా డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని పలమనేరు ఆర్టీసీ డీఎం టీకే స్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని సర్వీసులకు సంబంధించి ఏదైనా సమస్యలు, సలహాలుంటే 9959225678 అనే నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని అందులో పేర్కొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ


క్రీడా దుస్తుల్లో విద్యార్థులు

నదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ కరీముల్లా క్రీడాదుస్తులు వితరణగా అందించారని హెచ్ఎం జయకుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. రూ.10 వేలు విలువ చేసే దుస్తులను వితరణగా అందించారని చెప్పారు. గతంలోనూ పాఠశాల అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషిచేశారని చెప్పారు. పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏ కష్టమొచ్చినా మేమున్నాం!


పుంగనూరులో వధూవరులను ఆశీర్వదించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప

చౌడేపల్లి: ఏకష్టమొచ్చినా మేమున్నాం.. అధైర్యపడకండి అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. బుధవారం 29ఏ చింతమాకులపల్లెలో వైస్ ఎంపీపీ నరసింహారెడ్డియాదవ్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి పెద్దిరెడ్డితోపాటు చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలతో ముచ్చటించారు. పలువురు సమస్యలను పెద్దిరెడ్డి దృష్టికి తెచ్చారు. ఏ సమస్య వచ్చినా మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. అనంతరం వైస్ ఎంపీపీ దంపతులను పెద్దిరెడ్డి సత్కరించారు. నరసింహారెడ్డి యాదవ్ కుటుంబసభ్యులు కలసి పెద్దిరెడ్డికి జ్ఞాపికను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నేతలు నాగభూషణరెడ్డి, రవికుమార్‌రెడ్డి, రమేష్‌బాబు, సాధిక్‌బాషా రాణాధర్ నాగరాజ పాల్గొన్నారు.


పెద్దిరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నరసింహారెడ్డి యాదవ్ కుటుంబసభ్యులు

పుంగనూరులో..

పట్టణంలోని బలిజ సంఘ నాయకుడు తుంగా చంద్రశేఖర్ కుమార్తె వివాహానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం రాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే బండ్లపల్లెలో వెంకట్రామిరెడ్డి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకలు రేపు

నదుం: కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం నిర్వహించేందుకు పలు ఆలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మండల కేంద్రంలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోని మరకతేశ్వర స్వామి, మత్తుకువారిపల్లె సమీపంలోని మల్లీశ్వర స్వామి, జంగంపల్లెలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు మాదిగల ఆత్మీయ సదస్సు

పుంగనూరు: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో గురువారం మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. మదనపల్లెలో నిర్వహించే మాదిగల సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు మాదిగ కుటుంబసభ్యులు అందరు హాజరుకావాలని కోరారు.


పుంగనూరులో మాదిగ నేతల ర్యాలీ

మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: మండలంలోని కపాడంమిట్టపల్లెకు చెందిన శిరీష(35) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం చేసింది. బుధవారం తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఇంట్లోనే పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతిచెందిన కృష్ణప్ప

పుంగనూరు: పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీలో నివాసం ఉన్న దాసప్పగారి కృష్ణప్ప(50) బుధవారం రామసముద్రం మండలం దిగువపల్లిలో మృతిచెందాడు. కాగా మృతుడు మంగళవారం రాత్రి పుంగనూరు నుంచి రామసముద్రంలో పెళ్లికి అని వెళ్లాడని, అక్కడ మృతిచెందడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి


విద్యార్థులకు దంత రక్షణపై అవగాహన కల్పిస్తున్న డా.భవ్య

కుప్పంరూరల్: చిన్నతనం నుంచే దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని కేసీ ఆస్పత్రి వైద్యులు మంజునాథ్, భవ్య అన్నారు. బుధవారం గోనుగూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దంతాల రక్షణపై అవగాహన కల్పించారు. వైద్యులు మాట్లాడుతూ చిన్నతనంలో దంతాలు పాడయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, జాగ్రత్తలు పాటిస్తే దంతాలను కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు ఉచితంగా బ్రష్, పేస్ట్ పంపిణీ చేశారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి


అవగాహన సదస్సులో డీఎస్పీ ప్రభాకర్, సీఐ

పుంగనూరు: ప్రస్తుత సమాజంలో బాలికలు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని పలమనేరు డీఎస్పీ డి.ప్రభాకర్ సూచించారు. బుధవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో సీఐ శ్రీనివాసులుతో కలసి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా మానసిక స్థైర్యంతో వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు తెలియజేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఫ్రెండ్‌కు యాక్సిడెంట్ అయిందని చెప్పి..


గాయపడిన రఫిక్

పుంగనూరు: ఫ్రెండ్‌కు రోడ్డు ప్రమాదం జరిగిందని పిలిచి స్నేహితుడిపై దాడి చేసిన సంఘటన పట్టణంలో వెలుగుచూసింది. వివరాలిలా.. పట్టణానికి చెందిన రఫిక్ స్నేహితులు రోషన్, ముబారక్, నవాజ్‌కు గూడూరుపల్లి వద్ద ప్రమాదం జరిగిందని మంగళవారం రాత్రి ఫోన్ చేసి పిలిచారు. వెంటనే పట్టణంలో ఉన్న రఫిక్ హుటాహుటిన గూడూరుపల్లి వద్దకు చేరుకోగా కట్టెలు, రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గమనించిన స్థానికులు బాధితున్ని రక్షించి, 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయానికి రూ.1.29 లక్షల ఆదాయం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయ భూముల కౌలు వేలం ద్వారా రూ.1.29 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజు తెలిపారు. బుధవారం ఆలయ భూములకు సంబంధించి లీజు వేలం చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి పలువురు రైతులు బహిరంగ వేలంలో పాల్గొన్నారు. మొగిలి, టేకుమంద, ఊటువంక, 170 గొల్లపల్లె గ్రామాల్లో మొగిలీశ్వరస్వామి వారి ఆలయ భూములు ఉన్నాయి. ఈ భూముల్లో రైతులు మూడేళ్ల లీజు పద్ధతి ద్వారా పంటలు సాగుచేసుకోవచ్చన్నారు. ఆలయ ధర్మకర్త విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పాల్గొన్నారు.

కుప్పం..అభివృద్ధికి ఆమడ దూరం

- ఎన్నికల సమయంలో కుప్పతెప్పలుగా హామీలు
- అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా రూపాయి రాని వైనం
- రూ.50 కోట్ల మంజూరు జీఓకే పరిమితం
- సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్నా ప్రతిపాదనలకు మోక్షం నిల్


కడా కార్యాలయం

కుప్పం: ఎన్నికల సమయంలో కుప్పం అభివృద్ధికి హామీలు కుప్పతెప్పలుగా ప్రకటించారు. వాటి మాటెలా ఉన్నా కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రతిపాదనలపై సైతం ఊసేలేదాయె..! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలు దాటింది. ఈ కాలంలో రూ.50 కోట్లు కుప్పం అభివృద్ధి పనులకు మంజూరు చేసినట్లు ప్రకటనలు వచ్చాయి. అయితే అది జీఓకే పరిమితమైందని, నిధులు మాత్రం విడుదల కాలేదని అధికారులు పెదవి విరుస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అభివృద్ధిగానీ, పాలనగానీ ఆశించిన తీరులో ఏమాత్రం లేదని ప్రజలు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కడా ప్రతిపాదనల మాటేమిటో..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ (కడా)ని ప్రారంభించారు. దీనిని ఐఏఎస్ అధికారిని ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. నియోజకవర్గంలో మొదటి విడతగా అభివృద్ధి పనుల కోసం పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి కడా పంపి రెండు నెలలు కావొస్తున్నా వాటిపై ఇంతవరకు అతీగతీ లేదు. నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధికి రూ.110 కోట్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.110 కోట్లు, జలజీవన్ మిషన్ కోసం రూ.93 కోట్లు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు రూ.15 కోట్లు, కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 50 కోట్లతో ప్రతిపాదనలు కడా ప్రాజెక్టు ప్రభుత్వానికి పంపింది. వీటిలో నెల క్రితం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.50 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. అయితే ఇప్పటి వరకు నిధులు మాత్రం విడుదల చేయకపోవడం గమనార్హం!

ఫిర్యాదుల స్వీకరణ తప్పితే అభివృద్ధి పనులేవీ..?

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో కేవలం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదులు స్వీకరించడం తప్పితే అభివృద్ధి పనులంటూ ఏమీ చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సమస్యలపై వారంలో ఒకరోజు కడా పీడీ, నెలకు రెండుసార్లు జిల్లా కలెక్టర్ కుప్పం మండల సచివాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ప్రస్తుతానికి గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతున్నా వాటి పరిష్కారానికి చర్యలేవీ తీసుకున్న పాపానపోలేదని ప్రజలే రుసరుసలాడుతున్నారు. ఇక, నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసుకుని నిధుల విడుదల కోసం అధికారులు నిరీక్షిస్తున్నారు. ముందస్తుగా పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు ముందుకురాక పోవడంతో అధికారులకు దిక్కుతోచడం లేదు. దీంతో అభివృద్ధి ఊసే లేకుండా పోయింది.

కోటలు దాటుతున్న నేతల ప్రగల్భాలు

కుప్పం నియోజకవర్గానికి ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయలేదు. కానీ అధికార పార్టీ నేతల ప్రగల్భాలు మాత్రం కోటలు దాటుతున్నాయి. పదేళ్లుగా పట్టణ నడిబొడ్డు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. 2014 –19లో అధికారంలో ఉన్నా టీడీపీ అప్పట్లో వీటికి నష్ట పరిహారం చెల్లింపు విషయంలో చర్యలు తీసుకోలేదు. దీంతో అప్పటి నుంచి రోడ్డు విస్తరణ సగానికి నిలిపివేశారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ పనులు పూర్తి చేస్తారని ఆశ పడిన పట్టణ వాసులకు నిరాశే మిగిలింది. ప్రస్తుత అధికార పార్టీ నేతలు మాత్రం కోట్లాది రూపాయలతో కుప్పం అభివృద్ధి చేస్తున్నట్లు ఊకదంపుడు ప్రకటనలు గుప్పించడం తప్పితే చేతల్లో మాత్రం వాటి ఊసే కనిపించడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. నేతలపై మండిపడుతున్నారు.